క్లుప్తంగా

మద్యం అలవాటుకు దూరంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మద్యం తాగే అలవాటుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, ఆల్కహాల్ వినియోగం వల్ల శారీరక అనారోగ్యంతో పాటు ఆర్థిక నష్టం, సమాజంలో నిరాదరణ వంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని పలువురు వక్తలు హెచ్చరించారు. ఆల్కహాలిక్ ఎనానిమస్ సంస్థ ఏలూరు నగరంలో తమ కార్యక్రమాలను ప్రారంభించి 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో శనివారం సాయంత్రం ప్రజాచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన వక్తలు మాట్లాడుతూ మద్యం వ్యసనంతో బాధపడుతున్న వ్యక్తులు ఈ వ్యసనానికి దూరం కావాలనుకుంటే 96666 70466, 96666 70566 నంబర్లలో సంప్రదిస్తే ఉచితంగా పరిష్కార మార్గాలు చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో బి.లక్ష్మీ ప్రసాద్, సిస్టర్ సరిత పాల్గొన్నారు.

88 మందికి వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : లయన్స్‌క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక అగ్రహారంలోని రామకోటగి ప్రాంగణంలో పేదలకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య నిపుణులు ఐవీఎం నగేష్, సిబ్బంది 88 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్న వెంకట్రామయ్య, వేమ రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ



నూతన రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండలంలోని న్యాయంపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను శనివారం వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఎంపీపీ తాతా రమ్య, సర్పంచ్ తూముల రాజు, సీతాల దాసు, మెట్లపల్లి సూరిబాబు, పెనుమాక వెంకట సుబ్బారావు, పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యాబోధన అందించడమే ధ్యేయం

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



సుబ్బమ్మదేవి స్కూల్ పూర్వవిద్యార్థుల కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రాష్ట్రంలోని ఎంతోమంది పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యతతో కూడిన ఉత్తమ విద్యను అందించాలనే మహా సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నాడు నేడు పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఎంతో పటిష్టంగా మారుతున్నాయని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని అన్నారు. ఏలూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో నానిని శనివారం ఉదయం ఏలూరులోని సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఇటీవల సుబ్బమ్మ దేవి స్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించడంలో పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ చేసిన కృషి ఎంతో అభినందనీయమన్నారు. తమకు పాఠాలు నేర్పిన సుబ్బమ్మ దేవి నగర పాలక ఉన్నత పాఠశాలను మరింత అభివృద్ధి పరచాలనే మహోన్నత ఆశయంతో దేశ విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు వేలాది మంది ఏలూరుకు తరలిరావడం గర్వకారణమన్నారు. ఇటువంటి వేడుకను ఎంతో విజయవంతంగా నిర్వహించడం పట్ల పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరినీ ఆళ్ళ నాని ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన నాడు - నేడు కార్యక్రమంతో సుబ్బమ్మ దేవి పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతులు మరింత మెరుగు పర్చటానికి అన్ని విధాల తాను అండగా ఉంటానని నాని పూర్వ విద్యార్థుల కమిటీకి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నానికి పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పాఠశాల పూర్వ విద్యార్థులైన వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ళ నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తూ, హిందూ సంస్కృతి సంప్రదాయాలను మరింత శోభిల్లేలా జరిపే ధార్మిక కార్యకలాపాలకు అండగా నిలిచే దాతల చొరవ ఎంతో అభినందనీయమని రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని తెలిపారు. ఏలూరు తూర్పు వీధిలో దాతలు మడుపల్లి మోహన్ గుప్తా దంపతుల ఆధ్వర్యంలో నిర్మించబడిన శ్రీ సీతారామ కళ్యాణ మండపం ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన శివయ్య ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో నాని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పునః ప్రతిష్ఠ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విగ్రహాలను అందించేలా ప్రత్యేక చొరవ చూపి సహకరించిన నానికి ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, మాజీ చైర్మన్ మంచెం మై బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్, పాల్గొన్నారు.

రమణక్కపేట సమీపంలో దారి దోపిడీ?

పోలీసులమంటూ వ్యాపారుల నుంచి నగదు దోచుకెళ్లిన దుండగులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం రమణక్కపేట సమీపంలో శనివారం రాత్రి దారి దోపిడీ జరిగినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట నుంచి జంగారెడ్డిగూడెం ద్విచక్ర వాహనంపై వస్తున్న ఉల్లిపాయల వ్యాపారస్తుల వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీ చేసినట్లు తెలిపారు. వ్యాపారులను అడ్డగించిన దుండగులు తాము పోలీసులమని చెప్పి వాహనదారులను తనిఖీ చేయాలని బెదిరించినట్లు సమాచారం. ఆ సమయంలో ఉల్లిపాయల వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తుల వద్ద రూ. 1,75,000 వరకూ నగదు ఉన్నట్లు గుర్తించిన దుండగులు ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇంత డబ్బు ఎలా తీసుకువెళ్తారంటూ ప్రశ్నించి ఆ డబ్బును తీసుకుని వ్యాపారులను పోలీస్ స్టేషన్‌కు రమ్మని వారు కారులో ఉడాయించినట్లు సమాచారం. అయితే కొద్దిసేపటికి తాము మోసపోయామని తెలుసుకున్న వ్యాపారస్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిసింది. నకిలీ పోలీసుల చేతిలో మోసపోయిన వ్యాపారులు జంగారెడ్డిగూడెంకు చెందిన ఉల్లిపాయల వ్యాపారులని తెలిసింది. అయితే ఈ ఘటనపై పోలీసులు ఎటువంటి ప్రకటన చేయలేదు.

బెదిరింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: నకిలీ డాక్యుమెంట్‌లతో తన స్థలాన్ని వేరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్‌ను చేయించడంతో పాటు తనను, తన భార్యను చంపుతానని బెదిరిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం బేతుపల్లి గ్రామానికి చెందిన రంగు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం రంగు సత్యనారాయణకు జంగారెడ్డిగూడెంలో సర్వే నెంబర్ 332లో 793 గజాల స్థలం ఉంది. సదరు స్థలాన్ని భార్యపేరున రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే అదే గ్రామానికి చెందిన మహదేవ కాంతమ్మ ఆ స్థలాన్ని ఆక్రమించి, నకిలీ డాక్యుమెంట్‌లతో తన కుమార్తెలు శ్రీపాద రజిత, దూలబాక నర్మద పేరున రిజిస్ట్రేషన్ చేయిండంతో పాటు, ఆ స్థలాన్ని స్వర్ణవారి గూడెంకు చెందిన వైకుంఠరావుకు, తాడువాయికి చెందిన వాసిరెడ్డి పుల్లారావుకు విక్రయించింది. అలాగే స్థలాన్ని వదిలి వెళ్లమని, లేకపోతే చంపుతామని సత్యనారాయణ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

రజక సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఇటీవల ఏలూరు జిల్లాలో కలిసిన నూజివీడు రజక సంఘానికి నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘ భవనంలో ఎన్నుకున్నారు. చిక్కవరపు మన్మథరావును అధ్యక్షునిగా, చిక్కవరపు కృష్ణను ఉపాధ్యక్షునిగా, చిక్కవరపు చెన్నకేశవను కార్యదర్శిగా, దబ్బెర శ్రీనివాస్, భురవంచ నాగేంద్రలను సహాయ కార్యదర్శులుగా, వారితో పాటు మరొక నలుగురిని సలహా సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య మాట్లాడుతూ నూతనంగా ఏలూరు జిల్లాలో కలసిన నూజివీడు నియోజకవర్గంలో అనేక గ్రామాలలో ప్రభుత్వ జీఓలను అధికారులు అమలు పరచనందువలన వృత్తిపరమైన ఇబ్బందులు పడుతున్నారని కట్లయ్య అన్నారు. అనంతరం నూజివీడు రజక సీనియర్ నేతలు చిక్కవరపు మన్మధరావుతో పాటు పులువురు రజకనేతలు మాట్లాడుతు వంద సంవత్సరాల క్రితం నూజివీడు పాతపేట సమీపంలో నాలుగు ఎకరాల స్థలాన్ని రజకులకు కేటాయించారని అక్కడ రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ తీర్మానం చేశామన్నారు. ఈ సమావేశానికి జిల్లా యూత్ కార్యదర్శి వితాల శ్రీనివాస్ రావు అధ్యక్షత వహించగా జిల్లా రజకనేతలు కొమ్మంటి మురళీకృష్ణ ,కె.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా..



కన్నాయిగుట్టలో బాధితులకు వస్తువులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ చల్లన్నదొర

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు పలువురు దాతలు సాయం అందించి అండగా నిలుస్తున్నారు. వేలేరుపాడు తహసీల్దార్ కె చల్లన్నదొర శనివారం 27 గిరిజన కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి గృహ అవసరాలకు ఉపయోగపడే 17 రకాల వస్తువులను అందజేశారు. తిర్లాపురం సర్పంచ్ సోడె విజయ, ఎంపీటీసీ కరటం ముత్తమ్మ, డిప్యూటీ తహసీల్దార్ పాయం రమేష్, వీఆర్వోలు సంగీతరావు, చీమల వెంకటేశ్వర్లు, తాటి బాలకృష్ణ, వీఆర్ఏలు పిట్టా రమేష్, రాంబాబు, గణపతి, తదితరులు పాల్గొన్నారు. ఏలూరు ఆశ్రమం ఆస్పత్రి ఆధ్వర్యంలో బాధితులకు చీరలు, దుప్పట్లు, వంట సామాగ్రి, పంపిణీ చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ గోకరాజు రతీదేవి, ఆశ్రమం ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితులకు గ్యాస్ స్టౌలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తహసీల్దార్ చల్లన్నదొర, సోడే ఫణి, చంద్రశేఖర్‌రావు, కొండపల్లి పండు, రామకృష్ణ, ముత్యాలరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 11 రకాల వంటపాత్రలు, రెండు చీరలు, దుప్పట్లు, పురుషుల దుస్తులు మొత్తం కలిసి లక్షా 5వేల ఆర్థిక సాయం అందించారు. వేలేరుపాడు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.1500 చొప్పున రూ.40,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీపీఐ కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్, ఎండీ మునీర్, హేమశంకర్, కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబా, బాడిశ రాము, రమాదేవి, సాయమ్మ, చిన్నమ్మి, దేశమ్మ, ఇందిర, స్వాతి, విమల, వెంకటేశ్వర్లు, వీరయ్య పాల్గొన్నారు.

7,066 ఎకరాల్లో డ్రోన్ సర్వే



డ్రోన్‌తో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే రమణ

దెందులూరు: డ్రోన్‌తో చిత్రీకరణ రీసర్వేలో భాగంగా దెందులూరు మండలంలో శనివారం 7,066 ఎకరాల్లో రీసర్వే చేస్తున్నట్టు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే రమణ, దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. రీ సర్వేలో భాగంగా శింగవరం, కొమిరేపల్లి, కొత్తగూడెం, శ్రీరామవరం, ముప్పవరంలో డ్రోన్‌తో 28.61 స్క్వేర్ కిలో మీటర్లు చిత్రీకరణ చేశారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన గ్రామాల్లో చిత్రీకరణ కొనసాగుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే రమణ అన్నారు. దెందులూరు సర్వేయర్ రమణ, వీఆర్‌ఓ చంద్రం, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొట్టిన లారీ

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. యానాం నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు మార్గమధ్యమైన కురెళ్లగూడెం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న లారీ యూటర్న్ తీసుకోవడంతో ఈప్రమాదం జరిగింది. అతివేగంగా వస్తున్న ట్రావెల్ బస్సును లారీని స్వల్పంగా ఢీకొట్టింది. దీనితో ఒక్కసారిగా బస్ అదుపు తప్పి పక్కనే ఉన్న రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. పెను ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. భీమడోలు పోలీసులు విచారిస్తున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పెదపాడు: మండలంలోని కలపర్రు టోల్‌గేట్ ప్రాంతంలో పెదపాడు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, నగదు, ఇతర వస్తువులు రవాణా నిరోధానికి ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బిల్లులు లేకుండా, ఏవిధమైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు రవాణా చేస్తే సీజ్ చేస్తామని నాగబాబు చెప్పారు.

ఫ్లెక్సీల తొలగింపు

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్‌లో అమలులో భాగంగా శనివారం దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య మండలంలో అన్ని గ్రామ శివారు ప్రాంతాల్లో పర్యటించారు. గోపన్నపాలెంలోని రాజకీయ ఫ్లెక్సీలు, గ్రామ పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖ సిబ్బంది ప్రతి రోజూ పర్యవేక్షణ చేసి రాజకీయ పార్టీ ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలని తహసీల్దార్ ఆదేశించారు. ఆయన వెంట వీఆర్వో రామారావు ఉన్నారు.

రామదండు జెండాల పంపిణీ

దెందులూరు: ఉగాది పర్వదినం రోజున దేవదేవరుల శోభాయాత్ర నిర్వహణ కోసం శనివారం దెందులూరులో రామదండు సభ్యులు 4 వేల జెండాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఉగాది రోజున శోభాయాత్ర నిర్వహిస్తామని, భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మునిసిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆందోళన

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోటదిబ్బ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఏలూరు కార్పొరేషన్ సిబ్బంది ఈ ఆందోళనకు పూనుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరుస్తూ సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఎన్ఎంఆర్‌లకు బకాయి పడిన మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి పెరిగిన వేతనాలకు సంబంధించిన ఏరియర్లను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, ఎస్ఎన్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

పెదపాడు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన కనకదుర్గా ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు చెప్పారు. విధిగా అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన చెప్పారు. పెదపాడులో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ సంక్షోభం

దెందులూరు: కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతుల వ్యవసాయం సంక్షోభంలో ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ విమర్శించారు. శనివారం మండలంలోని ఉంగ్రాజవరంలో ఆంజనేయస్వామి గుడి ఆవరణలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతుల సమావేశం మండల అధ్యక్షుడు సున్నా వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కే. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటలు అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ధాన్యం సేకరణకు నిధులు కోత పెట్టడం వల్ల భవిష్యత్తులో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి ఉండదన్నారు. కొల్లి విజయభాస్కరరెడ్డి, పీ. రవికుమార్, కడగళ్ల దుర్గారావు, కంటిబోతు శ్రీనివాసరావు ఉన్నారు.

జేబు దొంగ అరెస్టు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం ఒక భక్తుడి జేబు కొట్టిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం. పెనుగొండ మండలం సత్యన్నారాయణపురానికి చెందిన పితాని సుధాకర్ చినవెంకన్నను దర్శించిన తరువాత, స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఆకివీడుకి చెందిన మేకల తిమోతి అనే వ్యక్తి సుధాకర్ ఫ్యాంటు జేబులోని రూ.10 వేల నగదు దొంగిలించాడు. ఇది చూసిన అక్కడి ప్రయాణికులు కేకలు వేయడంతో తిమోతిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇదిలా ఉంటే నిందితుడితో పాటు ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కోడిపందేలపై దాడి

రామసింగవరంలో కోడిపందేల స్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. వారి వద్ద నుంచి రూ.2,640 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	10-12
బెండకాయలు	48-52	కంద	36
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	58	అల్లం	70
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	48	చుక్కకూర	10
బంగాళదుంపలు	18	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-40	బఠాణి	60
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	04
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	30


చేతిరాత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ నిధి మీనా

చింతలపూడి : జాతీయ చేతిరాత పోటీల్లో ప్రతిభకనపరిచిన విద్యార్థినులను రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ నిధి మీనా అభినందించారు. స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని సౌత్ ఇండియ స్థాయిలో గొట్టుముక్కల అమృత సాయి, రాష్ట్ర స్థాయిలో జలాది చంద్రిక, జిల్లా స్థాయిలో ఆకుల ఆణి హాసిని ప్రతిభ కనపరిచారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నిధి మీనా వారికి ప్రశంసాపత్రాలను అందచేశారు. హెచ్ఎం సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం సర్పంచ్ వెంకాయమ్మకు సన్మానం



వెంకాయమ్మ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఉపాధి హామీ పథకంలో నీటిసేకరణ సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న బుట్టాయగూడెం సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, దేవరాజు దంపతులను శనివారం బుట్టాయగూడెం మండల సర్పంచ్‌ల బృందం ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల సంఘం నాయకులు కుంజా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సరియం లక్ష్మి, తాతి సీత, పెడకం విజయలక్ష్మి, తెల్లం రాముడు, మడకం రామలక్ష్మి, తెల్లం జయమ్మ, రవ్వా చంద్రకళ, జోడే సత్యదుర్గాప్రసాద్, ఉయికే బొజ్జిల చేతుల మీదుగా తెల్లం వెంకాయమ్మ, దేవరాజు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరియం చల్లయ్య పాల్గొన్నారు.